ఉచితంగా గుండె వైద్య సేవలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సాయి ఆస్పత్రిలో ప్రతి బుధవారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ ఎ.శ్రీరామ్మూర్తి చెప్పారు. బుధవారం ఆ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం ఒంటి గంట నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గుండె రోగులను చూస్తారని, ఉచితంగా ఇసిజి, ఎక్స్‌రే, స్కానింగ్ చేయబడునని చెప్పారు. అపోలా ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు శశాంక్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ గుండె పరీక్షలు చేసుకోవాలని, మద్య, ధూమపానాలకు, జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉండాలని సూచించారు. రోజువారీ వ్యాయామం చేయాలని కోరారు.

- జెసి ఆదేశించినా రైతులకు అందని కళాసీ ఖర్చులు
- రవాణా ఛార్జీల నమోదుపై సాగని విచారణ
- సుమారు రూ.23 కోట్లు స్వాహాయత్నం?
- ఎపి రైతు సంఘం పోరాటంతో వెలుగులోకి..

హమాలీ, రవాణా ఛార్జీల కథ కంచికేనా..?

ఖరీఫ్ ధాన్యం రవాణా, కళాసీ ఛార్జీల్లో అక్రమాల కథ కంచికేనా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రవాణా, కళాసీ ఛార్జీల చెల్లింపులో భారీఅవినీతి చోటు చేసుకుందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. దీనిపై స్పందన కార్యక్రమాల్లో అనేక ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, రైతులకు కళాసీ ఛార్జీలు చెల్లించాలని, రవాణా ఛార్జీల నమోదు ప్రక్రియపై విచారణ చేయాలని ఆదేశించారు. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నా... ఒక్కరైతుకూ కళాసీ ఛార్జీలు చెల్లించిన పాపాన పోలేదు. పైగా ఫిర్యాదులు చేసిన రైతులు.. పిఎసిఎస్‌లకు వెళ్లి అడిగితే... తమకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్న వైనం. ఇక రవాణా ఛార్జీల వ్యవహారంపై జరుగుతున్న విచారణ కథ కంచికేనని రైతులు వాపోతున్న పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - జామి

జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యాన్ని ఆర్‌బికెలు, పిఎసిఎస్‌లు, పిపిసిల ద్వారా కొనుగోలు చేశారు. సుమారుగా 4.12 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. హమాలీ, రవాణా ఛార్జీలు కింద క్వింటాకు రూ.52 వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ముందుగా రైతే భరించాలని అధికారులు చెప్పడంతో రైతులే ఖర్చు చేసిన పరిస్థితి. అధికారులు చెప్పినట్లు ప్రభుత్వం ఈ మొత్తాన్ని కొనుగోలు ఏజెన్సీలుగా ఉన్న పిఎసిఎస్, పిపిసిలకు జమ చేసింది. హమాలీ ఛార్జీల కింద 2021-22 కు గానూ రూ.12.06 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, పరపతి సంఘాలకు రూ.9.45 కోట్లు విడుదల చేసింది. ఈ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాలకు జమ చేయాలని గత నెల 26వ తేదీన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంత వరకు రైతులకు చెల్లించిన పాపాన పోలేదు. రవాణా ఛార్జీలకు సంబంధించి కొనుగోలు ఏజెన్సీలు నమోదు చేసిన పోర్టల్ ఆధారంగా విచారణ చేయాలని ఆదేశాలు జారీ అయినా, వాటిని పట్టించుకున్న నాథులే లేరని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రైతులకు తక్షణమే చెల్లించాలి

ప్రభుత్వం మాట విని హమాలీ, రవాణా ఛార్జీలు రైతులే భరించారు. తీరా ఆ డబ్బులు రైతులకు అందలేదు. ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ ఆదేశాల్లో భాగంగా రైతులకు తక్షణమే హమాలీ ఛార్జీలు చెల్లించాలి. రవాణా ఛార్జీల అక్రమాలపై జిల్లా వ్యాప్తంగా విచారణ చేపట్టాలి. బినామీ వాహనాలు నమోదు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- బి రాంబాబు,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రూ.23 కోట్ల అక్రమాలపై ఎందుకీ ఉదాసీనత?

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి హమాలీ, రవాణా ఛార్జీలకు సంబంధించి సుమారుగా రూ.23 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని కోట్ల రూపాయలు విడుదల చేశామని, వాటిని రైతులకు చెల్లించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా, ఫలితం లేకపోవడం గమనార్హం. ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ నమోదు జరిగింది. రైతుల ధాన్యాన్ని వారి సొంత రవాణా వాహనం ద్వారా మిల్లుకు చేర్చారు. కానీ జిల్లా వ్యాప్తంగా నామమాత్రంగా రైతుల వాహనాలు నమోదు చేసి, మెజారిటీ ధాన్యం ఏజెన్సీల వాహనాలు రవాణా చేసినట్లు నమోదు చేశారు. అంటే ఆదిలోనే తప్పు జరిగింది. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల విచారణ అదేశాలు బుట్టదాఖలు అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి వెనుక పెద్దల హస్తం ఉందన్న అనుమానాల నేపథ్యంలో ఉదాసీనత నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

త్వరలోనే హమాలీ ఛార్జీలు చెల్లిస్తాం

గత ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి హమాలీ ఛార్జీలు త్వరలోనే చెల్లిస్తాం. ఇప్పటికే అన్ని సంఘాలకు ఆదేశించాం. అయితే ప్రభుత్వం నుంచి సంఘాల నిర్వహణకు నిధులు విడుదల కావాల్సి ఉంది. త్వరలోనే పూర్తి స్థాయిలో రైతులకు చెల్లిస్తాం.

- రమేష్, జిల్లా సహకార అధికారి

విద్యుత్తు ఛార్జీల పెంపుపై... బొబ్బిలిలో ప్రజా సర్వే

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు ఛార్జీల పెంపు దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని రెడ్డికవీధిలో బుధవారం విద్యుత్తు ఛార్జీల పెంపుపై సిపిఎం ఆధ్వర్యాన ప్రజా సర్వే చేశారు. విద్యుత్తు ఛార్జీలు ఒకేసారి ఎక్కువ మొత్తంలో పెంచడంతో కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో చంద్రబాబు విద్యుత్తు ఛార్జీలు పెంచితే, దీనికి వ్యతిరేకంగా ఉమ్మడి రాష్ట్రంలో వామపక్షాలతో కలిసి సిఎం జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోరాటం చేశారని గుర్తుచేశారు. నేడు సిఎం జగన్ విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడం దారుణమన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే ఎటువంటి భారాలూ వేయమని చెప్పి, తీరా గద్దెనెక్కాక అన్ని రకాల ధరలు, ఛార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రజల కళ్లు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు వేయడమేమిటని ధ్వజమెత్తారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే వినియోగదారులకు తీవ్ర నష్టమన్నారు. దీనిపై ఈ నెల 31న విద్యుత్తు శాఖ డివిజనల్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, పి.శంకరరావు, బొబ్బిలి, రామభద్రపురం మండల కార్యదర్శులు ఎస్.గోపాలం, వి.శ్రీనివాసరావు, మండల నాయకులు ఎ.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మణి, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్తు భారంపై ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ఒపిఎస్‌ను కొనసాగించాలని గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జిపిఎస్ మాకొద్దు.. ఒపిఎస్ కొనసాగించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొస్తామని ప్రకటించడం సరికాదన్నారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 30 నుంచి 35 ఏళ్లపాటు ప్రభుత్వానికి సేవలు అందించే ఉద్యోగులకు ఇచే పెన్షన్ విషయంలో ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి యుగంధర్, జిల్లా నాయకులు పి.భూషణరావు, పివై అనిల్‌కుమార్, విజయనగరం అర్బన్ శాఖ అధ్యక్ష , కార్యదర్శులు బి.బాలభాస్కరరావు, సిహెచ్‌వి సతీష్, నాయకులు బి.చంద్రశేఖర్, ఎస్.సూర్యనారాయణ, కె.పి.నాయుడు, ఎం.సత్యనారాయణ, పి.సునీల్, కనకరత్నం, సుధీర్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న సంఘం నాయకులు

యోగాతో మానసిక ప్రశాంతత

డిఆర్‌ఒ ఎం.గణపతిరావు • రాజీవ్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

మనిషి జీవన శైలిపై అత్యంత ప్రభావం చూపే యోగా సాధనతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. అన్ని రకాలుగా ఉత్తమ ఫలితాలు అందించే యోగా సాధనను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్, నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌ఒ గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, జిల్లాస్థాయి అధికారులు వివిధ ప్రక్రియలకు చెందిన యోగాసనాలు వేశారు. యోగా నిపుణులు ఉషారాణి, శ్రీనివాస్, సుందర శివరాం యోగాసనాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డిఆర్‌ఒ యోగా దినోత్సవ ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. ఒక రోజు చేసి విడిచిపెట్టే ప్రక్రియ కాదని.. నిరంతరం చేయాల్సిన సాధనని చెప్పారు. రోజూ చేస్తేనే ఆశాజనక ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం యోగాలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, క్రీడాకారులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. తిరుమల మెడికేర్ ఆసుపత్రి సౌజన్యంతో కార్యక్రమానికి వచ్చిన వారికి తాగునీరు సమకూర్చారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అక్కడకు వచ్చిన వారికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేశారు.

కార్యక్రమంలో ఆయుష్ విభాగం జిల్లా అధికారి వరప్రసాద్, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.సూర్యనారాయణరావు, తిరుమల మెడికవర్ ఆసుపత్రి ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఇతర వైద్యులు చైతన్య స్వప్న, రజితా రాయ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు, యువత, చిన్నారులు

23న సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఈ నెల 23న కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశంలో చట్టంలోని నిబంధనల అమలు, అత్యాచార బాధితులకు సహాయ పునరావాస చర్యలు, కేసుల సత్వర విచారణ తదితర అంశాలపై సమీక్షిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పర్యవేక్షణ కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

కెజిబివి పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెజిబివిల్లో ఉద్యోగాల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ బుధవారం స్థానిక యువజన వసతిగృహంలో ప్రారంభమైంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. 1:3 నిష్పత్తిలో పోస్టులు భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. ఎంపిక ప్రక్రియ రాష్ట్ర స్థాయిలో జరగనుంది. కేవలం సర్టిఫికెట్ల పరిశీలన మాత్రం జిల్లాకు అప్పగించడంతో బుధవారం నుంచి ప్రక్రియ సమగ్రశిక్ష అధికారులు, జిసిడిఒ సారథ్యంలో సాగుతోంది.



- తూతూ మంత్రంగా ఎస్ఇబి దాడులు
- చేతులు దులుపుకునేందుకు ప్రయత్నాలు
- ప్రజాప్రతినిధుల వద్దకు రాయబారాలు
- 'ప్రజాశక్తి' కథనంతో ఉరుకులు, పరుగులు

ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద తూతూ మంత్రంగా ఎస్ఇబి (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. బుధవారం 'ప్రజాశక్తి'లో 'ఎనీ టైం... ఎనీ సెంటర్.. మస్తుగా మద్యం'.. అనే శీర్షికతో కథనం వచ్చిన విషయం విదితమే. దీనిపై జిల్లా మద్యం నియంత్రణ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. ఎందుకంటే, అక్రమ తంతంతా వారి కనుసన్నల్లోనే జరుగుతోందన్నది సుస్పష్టమే. ఈ విషయమై పలువురు ప్రజాప్రతినిధులు సైతం ఎస్ఇబి అధికారులపై ఆరోపణలు చేయడం చర్చనీయాంశమైంది.

మల్లగుల్లాలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తమపై వచ్చిన ఆరోపణలను కడిగేసుకునేందుకు బుధవారం మద్యం దుకాణాలను సిబ్బందితో పరిశీలించారు. అంతా సక్రమంగా ఉందనే రిపోర్టును ఉన్నతాధికారులకు ఇచ్చేందుకు సిద్ధం చేసుకున్నారు. కొంతమంది మధ్యవర్తులతో అంతా సక్రమంగా జరుగుతుందని సంతకాలు తీసుకునే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పూసపాటిరేగ సర్పంచ్ టొంపల సీతారాంను కూడా ఎస్ఇబి అధికారులు సంప్రదించారు. అంతా సక్రమంగా ఉందని, ఇకపై ఎటువంటి అక్రమమూ జరగకుండా చూస్తామంటూ చెప్పినట్లు తెలిసింది. అంతా సక్రమంగా సాగుతోందని తమకు కాగితంపై సంతకం చేయాలని సంబంధిత అధికారులు సర్పంచ్ ముందు మొరపెట్టుకోవడం సిగ్గుచేటనే చెప్పాలి. మద్యం దుకాణంలో పనిచేసిని సిబ్బందిని సంబంధిత ప్రజాప్రతినిధుల వద్ద పావుగా వాడుతున్నారు. అక్రమం కాదని, అంతా సక్రమమేనని సంతకాలు చేయకపోతే తమ ఉద్యోగాలు పోతాయంటూ సెంటిమెంటును పండించే డ్రామాకు తెరదీస్తున్నారు. మరి కొంతమంది ప్రజాప్రతినిధులకు తాయిలాలు ఇస్తామంటూ ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. సిఎం జగనన్న లక్ష్యానికి వీరే తూట్లు పొడుస్తున్నారంటూ పలువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామూళ్ల కోసం అధికారులు తమ పేరును వాడేస్తున్నారని మండల స్థాయి ప్రజాప్రతినిధి ఒకరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి దుకాణాల్లో మద్యం సక్రమంగా అమ్మకాలు జరగకపోయినా, వేలం పాటలు రద్దు చేయించకున్నా తీవ్ర పరిణామాలు జరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

జగనన్న సురక్షతో ధ్రువపత్రాల జారీ సులభం

మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు మరింత సులభతరంగా ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జగనన్న సురక్ష పథకం ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పూర్తి ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను నగరపాలక సంస్థ ద్వారా రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల వివరాలను సేకరిస్తారన్నారు. అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని ప్రజలను కోరారు. జూలై ఒకటో తేది నుంచి సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు సచివాలయాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా కుల, నివాస, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, జనన, మరణ, వివాహ, మ్యుటేషన్ విధానాలు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ నిక్షిప్తం, రైతు వ్యవసాయ ఆధారిత పంట హక్కు కార్డులు వంటి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-రేగిడి

జులై నెలాఖరికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, అట్టహాసంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.. అధికారులను ఆదేశించారు. బుధవారం రేగిడి మండలం సోమరాజుపేట, అంబఖండి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న సచివాలయ, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు, నాడు -నేడు పనులను కలెక్టర్ పరిశీలించారు. మనబడి నాడు -నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాడు-నేడు పనులకు సంబంధించి నిధులు ఉన్నప్పటికీ నిర్మాణాల్లో జాప్యం ఎందుకని సమగ్ర శిక్ష ఎఇ దాలయ్య, ఎంఇఒ ఎం.వరప్రసాదరావును ప్రశ్నించారు. అనంతరం ఉంగరాడ మెట్ట హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వైద్య సేవలు విస్తృతం చేయాలని, ప్రస్తుత సేవలు ఆశించిన స్థాయిలో లేవని అసంతృప్తి వ్యక్తంచేశారు. జులై చివరికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సోమరాజుపేటలో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి, శాఖల వారీగా పనితీరుపై ఆరాతీశారు. సచివాలయ ఉద్యోగులు పనితీరు మెరుగు పడాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని తెలిపారు. సమస్యలపై తక్షణమే స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమయానికే సచివాలయానికి హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అప్పారావు, మండల ప్రత్యేకాధికారి పెంటోజీరావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ బాసూరు శంకర్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్, మండల అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

టిడిపికి బిసిలే వెన్నెముక

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపికి బిసిలే వెన్నెముకని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిలను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో చంద్రబాబు అనేక పదవులు ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల వరప్రసాద్, యాదవ కమిటీ అధికార ప్రతినిధి నూకాలమ్మ, జిల్లా యాదవ కన్వీనర్ ముద్దాడ చంద్రశేఖర్, కోండ్రు శ్రీనివాసరావు, కొర్నాన ఆదిబాబు, కొర్నాన రాజ్యలక్ష్మి, ఇప్పిలి రామారావు, కోదండరాం, జె.జనార్దన్, శంకర్ పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్‌లో సౌమ్య ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రా యూనివర్సిటీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపిసి విద్యార్థి ఎం.సౌమ్య 9.52 గ్రేడ్ పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రత్యేక అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కె.సునీత 9.04, కె.చంద్రిక 8.74, కె.ప్రవళిక 8.56, కె.లహరి 8.33 గ్రేడ్ పాయింట్లు సాధించారు. వీరిని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సుభ, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుభ

హాస్టల్‌ను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం తీరు

ప్రజాశక్తి - బొబ్బిలి

గవర్నమెంట్ హాస్టల్‌ను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జెఎసి రాష్ట్ర కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ అన్నారు. స్థానిక జండా మహల్ జంక్షన్ వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో పట్టణంలో ఉండే ప్రభుత్వ బిసి బాలుర కళాశాల వసతి గృహాన్ని కోమటిపల్లి పాత తాండ్రపాపారాయ పాలిటెక్నిక్ కాలేజ్ వద్దకు మార్చారన్నారు. 9 జూనియర్ కాలేజీలు, ఆరు డిగ్రీ కాలేజీలు, 4 ఐటిఐ కాలేజీలు ఉన్న బొబ్బిలి పట్టణంలో కాకుండా కోమటిపల్లి వద్దకు మార్చడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణంలో బిసి వెల్ఫేర్ కి ఉన్న భవనాలు ఖాళీ ఉన్నా కూడా అక్కడ ఉంచకుండా కోమటిపల్లి మార్చడంలో ఉన్న అంతర్యం ఏంటో చెప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కోమటిపల్లిలో ఉండే ఆ బీసీ హాస్టల్‌ని బొబ్బిలికి మార్చకపోతే ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జెఎసి డివిజన్ కార్యదర్శి ప్రసాద్, పట్టణ కమిటీ అధ్యక్షుడు నాయుడు, రమేష్, సతీష్, సురేష్, భాను

బెల్ట్ షాపులపై దాడులు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో బెల్ట్ షాపులపై రేగిడి ఎస్ఐ ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అదే గ్రామానికి చెందిన జి. అన్నారావు కిరాణా షాపులో 23 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. వాటిని సీజ్ చేశారు. సీజ్ చేసిన అనంతరం రేగిడి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా ఉంచామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే గ్రామస్తులు ఫిర్యాదు చేయాలని సూచించారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గంట్యాడ: మండలంలోని మదనాపురం ఎపి మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2003 -2004 సంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. దీని కోసం పాఠశాల నుండి దరఖాస్తులను అందిస్తున్నామన్నారు. అనంతరం పరీక్షను నిర్వహించి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం పాఠశాలను సంప్రదించాలని కోరారు.

రెండో ఎంఇఒగా వెంకటరావు

గంట్యాడ: మండలంలోని రెండో ఎంఇఒగా ఎస్. వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎపిటిఎఫ్ మండల శాఖ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడానికి ఉపాధ్యాయులందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేయాలని అన్నారు. మండలానికి మంచి పేరు తేవాలని ప్రతి సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను సర్పంచ్ మదిన లక్ష్మి బుధవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి యు. మాధవి లత దగ్గరుండి పనులు చేపట్టారు. రానున్న వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండటానికి, వీధి కాలువలలో నీరు ఆటంకం లేకుండా ప్రవహించడానికి వీలుగా పనులు చేశారు. కంటకాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల కంటకాపల్లి, కొత్త సుంకరపాలెం, కొత్తూరు గ్రామాలలో వీధి కాలువలు పూడిక తీసి, ట్రాక్టర్ ద్వారా చెత్త తరలించారు. కొత్తూరు గొప్పి నుండి కంటకాపల్లి రైల్వే గేటు వరకు గల చెత్త, డెబ్రిస్‌ను జేసీబీ సహాయంతో తరలించారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లకు నోటిఫికేషన్

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 21 నుంచి 28 వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు పాఠశాలలో లభ్యమవుతాయని ఓసి, బిసి విద్యార్థులకు రూ.150, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.75 రుసుము చెల్లించాలన్నారు. ఈ రుసుమును నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, ద్వారా చెల్లించాలన్నారు.

శ్రీచైతన్యలో కరాటే తరగతులు ప్రారంభం

లక్కవరపుకోట: మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వ్యాయామంతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాలని ఉద్దేశంతో ఉచిత కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎవివి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. అనంతరం అంతర్జాతీయ యోగ - డే సందర్భంగా విద్యార్థులతో యోగా ఆసనాలు చేయించారు. ఈ పాఠశాల కరస్పాండెంట్ రాఘవ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ కరాటే శిక్షకులు, విక్టరీ షటో కాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

నెల్లిమర్ల: జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు సూచించారు. బుధవారం జరజాపుపేటలో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికార్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ రామారావు మాట్లాడుతూ 86 ఇళ్ల పునాది స్థాయి, 6స్లాబ్ లెవెల్లో ఉన్నట్టు గుర్తించి వారికి అడ్వాన్స్‌గా రూ.15వేలు, రూ.20వేలు ఖాతాలో జమ చేశారన్నారు. ఇంకా లబ్ధిదార్లు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిల వాసు, నల్లి శ్రీను, పోలు బోతు నారాయణ మూర్తి, హౌసింగ్ ఎఇ రేవళ్ల పవన్, ఇన్స్పెక్టర్ ఎన్. ప్రదీప్, మెప్మా సిఎంఎం డి.గోవింద రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితులకు మాజీ ఎంపిటి, టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ చేతుల మీదుగా బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు ఐదుగురుకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్‌రావు, కలిదిండి రంగరాజు, జగదీస్ రాజు, బూర్లె రవి, బగ్గ రామారావు, యడ్ల సూరిబాబు, మహంతి శ్రీను, తొత్తడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎమ్మెల్సీ ఆకస్మిక తనిఖీ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగినపుడే విద్యలో మంచి ఫలితాలు సాధించగలరని చెప్పారు. విద్యార్థులంతా జగనన్న విద్యా కానుకలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. గంగరాజు, సత్యనారాయణ, ఎంపిటిసి టివి రమణ, ఎంఇఒ పి. బాల భాస్కర్ రావు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి రాంప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

త్వరగా ఇంజినీరింగ్ పనులు చేయాలి

డెంకాడ: మండలంలో వివిధ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇంజినీరింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

గజపతినగరం: జూలై ఒకటో తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమం పై జెడ్‌పిటిసి గార తౌడు, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్వేయర్లు, విఆర్‌ఒలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని జగనన్న సురక్ష కార్యక్రమం జరగాలని దానికి కావలసిన చర్యలు చేపట్టాలని అన్నారు. వాలంటీర్లు 24వ తేదీ నుండి సర్వే నిర్వహిస్తారని లబ్ధిదారులకు కావలసిన సేవలను జీవో-10 ద్వారా ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు. జగనన్న భూహక్కు - భూ రక్ష పథకంలో ఈ-సర్వేలను సమన్వయ పరచుకోవాలని అన్నారు. సమావేశంలో తమ్మిరాజపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, ఎంపిడిఒ కిషోర్‌కుమార్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం, కెఆర్ పేట, రామస్వామి పేట గ్రామాలలో ఉపాధి హామీ వేతనదారులు ఘనంగా జాతీయ యోగా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పట్నాయక్ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వేతనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆదిలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్ : మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఆయుష్ హెల్త్‌వెల్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ ఎస్ ఉమాదేవి ఆధ్వర్యంలో కోమటిపల్లి జెడ్‌పి హైస్కూల్లో బుధవారం అంతర్జాతీయ తొమ్మిదవ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారిని ఉమాదేవి యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. యోగ శిక్షకులు మండల వెంకటరమణ, శీలం అప్పలకొండలు విద్యార్థులకు యోగా పంచములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డీ లచ్చమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్య కుమారి, అంగనవాడి, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై యోగా గురువు జామి భాస్కరరావు వివరించారు. రాజా కళాశాల మైదానం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. యోగాతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని యోగ గురువులు చెప్పారు.

నెల్లిమర్ల: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో యోగా ప్రాధాన్యత గురించి, ఆసనాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. అనంతరం కోచ్ అర్జున్ విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డీన్ ప్రొఫెసర్ మురళీ, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీడియోల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సెంచూరియన్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

జీవితంలోయోగ ధ్యానం ఒక భాగంగా అలవర్చుకోవాలి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నగర పంచాయతీలో శ్రీ ఆదిత్య విద్యాలయంలో బుదవారం స్కౌట్స్ విద్యార్థులు, గర్ల్స్ హై స్కూల్ గైడ్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్, ఎంఇఒ ఈపు విజయకుమార్ యోగా విశిష్టత వివరించారు. ప్రతి ఒక్కరు జీవితంలో ఒక భాగంగా యోగ, ధ్యానాన్ని అలవర్చుకోవాలని తద్వారా మంచి ఆరోగ్యంతో పాటు ప్రశాంతమైన జీవిత అలవర్చుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ గైడ్ టీచర్స్ శైలజ, సుజాత, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.సూరిబాబు, పాఠశాల హెచ్‌ఎం వి.అమృత పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అంతర్జాతీయ యోగ దినోత్సవం బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఎస్.వాణి సారథ్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ సాధనను అన్ని వయసుల వారు చేయవచ్చని, శారీరక మానసిక ఉల్లాసానికి యోగ ఎంతోగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. అనంతరం కోర్టు ఉద్యోగి కె.శ్రీకర్ పర్యవేక్షణలో యోగాసనాలను న్యాయమూర్తి, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, బీవీఎస్ రామారావు, వారాది ఈశ్వరరావు, బి.సత్యనారాయణ, బి.వెంకటరావు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు ఆధ్వర్యంలో, మోక్ష యజ్ఞ యోగ మందిర నిర్వాహకుల ఆధ్వర్యంలో శ్రీనివాస కాలనీలో, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని పెద మేడపల్లి ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యం అందించే యోగా భారతదేశంలో వేద కాలం నుంచి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం

మెరక ముడిదాం: యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తాయని ఉపాధి హామీ అధికారి ఎస్. పెదప్పల నాయుడు అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని రాచ గుమడాం, భీమవరం, మెరక ముడిదాం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద వేతన దారుల ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెఇలు నరేంద్ర, త్రినాద్ నాయుడు, టిఎలు రామకృష్ణ, వెంకటేష్, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: సీతం కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

సీతంలో యోగాసనాలు

విజయనగరంటౌన్ : సీతం కళాశాలలో యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు సత్యనారాయణ.. సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వివిధ యోగాసనాలను చేయించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి బెటాలియన్ సుబేదార్ మేజర్ బి.ధర్మశీల, సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, సుబేదార్ జె.చంద్రరావు పాల్గొన్నారు.

గురజాడ పాఠశాలలో.. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలలో ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో.. యోగా డేను నిర్వహించారు. జెఎన్‌టియు వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ స్వామి నాయుడు, ప్రిన్సిపల్ కె.శ్రీకుమార్, డైరెక్టర్ రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ఆర్.గురునాథ్ పాల్గొన్నారు.

శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో యోగా దినోత్సవాన్ని క్లబ్ అధ్యక్షుడు చెల్లూరు శ్రీనివాసరావు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

డిగ్రీ కళాశాలలో యోగా ఆవశ్యకతపై గురువు గంగాధర్ అవగాహన కల్పించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.సుభ, పీడీ డాక్టర్ పి.జయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు..

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ ఈపు విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో అఖిల భారత స్కూల్ క్విజ్ -2023 మండల స్థాయి పరీక్షా పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా మొదటి, రెండు, మూడు స్థానాల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల- నెల్లిమర్ల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - మొయిద, మోడల్ స్కూల్- సతివాడ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. మొదటి స్థానం సాధించిన వారు ఈ నెల 28వ తేదీన జరగబోయే జిల్లా స్థాయి పోటీలకు పాల్గొవలసి ఉందని ఎంఈఒ తెలిపారు.

డెంకాడ : మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌బిఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలకు మండలంలో ఉన్న పాఠశాల నుంచి సుమారు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలను డెంకాడ ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ పి కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలకు మండల స్థాయి ఇంఛార్జిగా పెద్ద తాడివాడ ప్రధానోపాధ్యాయులు జి రాజశేఖర్ పనిచేశారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి డెంకాడ జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థికి, ద్వితీయ బహుమతి మోడల్ స్కూల్ అక్కివరం విద్యార్థికి, తృతీయ బహుమతి పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థికి వచ్చాయి. వీరికి రూ.5వేలు, రూ. 4వేలు, 3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ రాధాకృష్ణ, లీడ్ డిస్టిక్ మేనేజర్ ఎస్‌బిఐ విజయనగరం ఎ. శ్రీనివాసరావు, ఏపీజీవీబీ ఆర్‌ఎం డి రామకృష్ణంరాజు, నోడల్ అధికారి బి కిషోర్ కుమార్, పాల్గొన్నారు.

డెంకాడ: గెలిపొందిన విద్యార్థులతో ఎంఇఒ, ఉపాధ్యాయులు

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్‌బిఐ ఆధ్వర్యంలో ఎపిజివిబి బ్యాంకు, పాఠశాల సంయుక్తంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంఇఒ బాల భాస్కర్ పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఫణికుమార్, సుదర్శన్, ఇన్విజిలేటర్ డి కన్నయ్య, హెచ్‌ఎం ఎస్ఎస్ వలి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక ఎస్‌బిఐ మేనేజర్ పి హరికృష్ణ, నోడల్ అధికారిగా ఎంఇఒ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఆర్‌బిఐ క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఈ క్విజ్ పోటీలలో మండలంలో గల 12 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎపిఆర్‌ఎస్ తాటిపూడి గర్ల్స్ పాఠశాలకు ప్రథమ, కొట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. వీరికి నగదు బహుమతులు ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గండి గణేష్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆర్‌బికె పరిశీలన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని నరవ రామవరం గ్రామాల్లోని ఆర్‌బికెలను వ్యవసాయ శాఖ జెడి టివి రామారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. పిఎం కిసాన్ ఇకెవైసి ఎలా జరుగుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతేడాది ధాన్యం రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లించిదని రైతులకు అందాయా లేదా అని అడిగారు. అనంతరం రామవరం గ్రామాన్ని పరిశీలించి మట్టి నమూనా సేకరణ ఏ విధంగా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జెడి రామారావు

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పేద విద్యార్థులను ప్రోత్సహించాలని సిపిఎం సీనియర్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. మంగళ వారం రాత్రి నగరపంచాయతి పరిధిలోని జరజాపుపేట 17వ వార్డు రామమందిరం వీధిలో ఇటీవల పదో తరగతిలో పాఠశాలలో అధిక మార్కులు సాధించిన సంపర్తి హేమలతను సత్కరించారు. సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, టిడిపి యువ నాయకుడు కాళ్ల రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు పేదరికం అడ్డు రాకూడదని అటువంటి పిల్లలకు తాము అండగా ఉంటామని అన్నారు. అవసరమైతే తమ నాయకుల, ట్రస్ట్‌ల, సేవాసంఘాల సహకారంతో వారి చదువుకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థినికి నగదు ప్రోత్సహం అందించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతి టిడిపి ఉపాధ్యక్షులు బోలె కృష్ణమూర్తి, బోలె కృష్ణ, ఎరుబోతు త్రినాధ్, బోలె పైడిరాజు, కనకల పద్మనాభం, తుమ్ము అశోక్, నల్లి జనార్ధన్, రాఘవేంద్ర ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, రామ మందిరం వీధి యువత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని సత్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

అందరి సహకారంతో పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజలు, పంచాయితీ వార్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది అందరి సహకారంతోనే పంచాయతీ అభివృద్ధి సాధ్యమని కొత్తవలస మేజరు పంచాయితీ సర్పంచ్ మచ్చ యర్రయ్య రామస్వామి అన్నారు. బుధవారం పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిధుల కొరత కారణంగా కొన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం ఆలస్యమైందన్నారు. వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులు జరగని మాట వాస్తవమేనని అన్నారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతర నిధుల్లో జీతాలు, అభివృద్ధి పనుల నిర్వహణ ఇతరత్రా ఖర్చులు కాగా రూ. లక్షా 5వేలు మాత్రమే ఉందని సభలో వివరించారు. పంచాయతీ పరిధిలో 21 అక్రమ లే అవుట్‌ల పనులు జరుగుతున్నాయని, వారిపై చర్యలు చేపట్టాలని 6వార్డు సభ్యుడు గొరపల్లి రాము తెలిపారు. వీధి దీపాల నిర్వహణ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సిబ్బంది పనితీరుపై పలువురు సభ్యులు సభలో ప్రశ్నించారు. ఆర్.యూ.బి వద్ద రోడ్డుకు అనుకుని ఉన్న షాపులు తొలగించి రహదారిని వెడల్పు చేసి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని వైస్ ఎంపిపి కర్రి శ్రీను సభలో కోరారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కర్రి ధర్మారావు, ఇఒ కన్నబాబు, ఉపసర్పంచ్ పెనగంటి మంగవేణి, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో అవసరం

కొత్తవలస : చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఆనందరావు అన్నారు. సభల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో మండలంలోని గొల్లల పాలెం, చీడువలస, రామలింగాపురం, దేవాడ, వీరభద్రపురం, తుమ్ముకాపల్లి గ్రామాల్లో చిరుధాన్యాలు పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర పంటలు వెయ్యాలని రైతులకు తెలియజేశారు. పిఎండిఎస్ భూమిలో వేసి 45 రోజుల తర్వాత భూములో కలయిదున్నడం వల్ల భూమికి సుమారు రెండు నుంచి మూడు టన్నులు నత్రజని భూములోకి అందుతుందన్నారు. పిఎండిఎస్ వల్ల జీవవైవిద్యం ఏర్పడుతుందని, నేల గుల్లభారుతుందని, నీటి ఎద్దడి తట్టుకుంటుందని భూములు వానపాములు వృద్ధి చెందుతాయని, వివిధ రకాల మొక్కలు వేరు వ్యవస్థ వివిధ రకాల చక్కెర స్రావాలు విడుదల చేసి భూములో జీవవైవిద్యం ఏర్పడుతుందని చెప్పారు. ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు వేసుకున్నట్లయితే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్, రమేష్, కోటి బాబు, ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ కోఆర్డినేట్స్ ఈశ్వర్, గోవింద్ ఇంటర్నల్ కమ్యూనిటీ రీసెర్చ్ పర్సన్స్ భవాని, రాజేశ్వరి పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలి

ప్రజాశక్తి- మెంటాడ

విజయనగరం జిల్లా వెదురువాడు బ్లాక్ 2 రేంజిలో 7 బీట్లు, 50 గిరిజన గ్రామాలు అటవీ పరిధిలో కొనసాగించాలని ఎపి కౌలు రైతులు సంఘం, ఎపి ఆదివాసి సంఘాలు కార్యదర్శులు రాకోటి రాములు, తామారాపల్లి సోములు డిమాండ్ చేశారు. వారి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలానికి సంబంధించి అటవీ పరిధి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి రేంజిలో చేర్చడం వల్ల మండలానికి సంబంధించి గిరిజనుల ఇబ్బందులు పడతారన్నారు. సమస్యలు పరిష్కరించుకోవడానికి, రాకపోకలకు పాడేరు వెళ్లి రావడం కనీసం అయిదు ఆరు రోజులు సమయం పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెదురువాడ బ్లాక్ 2లో 13వేల హెక్టార్లు విస్తరించి వుందని, దీని పరిధిలో భీంఫోల్ సెక్షన్, ఆంద్ర, మెంటాడ, రొంపల్లి, కంచూరు, పెదకోనిల, సర్వేపల్ల, బీనుపాండు బీట్లుతోపాటు మరో 50గిరిజన గ్రామాలు వెదురువాడ బ్లాక్2లో కొనసాగించాలన్నారు. విజయనగరం జిల్లాలో ఐటిడిఏ కార్యాలయం ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ రామకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గేదెల పెదరాము, జానకిరాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వేపాడ

డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతమని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అన్నారు. మత్తు పదార్థాలు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలిసి ఆయన వీధుల్లో తిరిగితూ మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నష్టాలు గూర్చి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేపాడ: ర్యాలీ చేస్తున్న ఎస్ఐ, తదితరులు

నెల్లిమర్ల: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. బుధవారం సతివాడ మోడల్ స్కూల్, జెఎన్‌ఎం కళాశాలలో మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకువద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలిసులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ చెప్పారు. మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన పైల సత్యంనాయుడు అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహించి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది, ఎస్ఇబి ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది కలిసి బుధవారం దాడి చేసి 22 మద్యం సీసాలు సీజ్ చేశామన్నారు. అక్రమంగా మద్యం, నాటుసారా అమ్మిన, నాటుసారా తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం, నాటుసారా నివారణకు 9440902372 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు బైక్ వేలం పాట

ప్రజాశక్తి- శృంగవరపుకోట.

పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎక్సైంజ్ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన జుపిటర్ హోండా బైక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని గురువారం ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని ఔత్సాహకులు ఈ వేలంపాటలో పాల్గొనాలని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

డీలర్లు అందుబాటులో ఉండాలి

మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ పథకంలో రేషన్ డీలర్లు అందరు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తహశీల్ధార్ పి. విజయ భాస్కర్ తెలిపారు. తన కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లు, డీలర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. మండలంలో 8 ఎండియు, చీపురుపల్లిలో 5 ఎండియు వాహన ఆపరేటర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఫోర్‌వీలర్ లైసెన్సు ఉన్న వారు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.21వేలు వేతనం ఇస్తుందని చెప్పారు. మండల రేషన్ డీలర్ల సంగం అధ్యక్షుడు సుంకరి జయ సింహం నాయుడు, డీలర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గజపతినగరం: అగ్ని ప్రమాదాలపై గజపతినగరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.రవి ప్రసాద్ రిలయన్స్ ట్రెండ్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఎప్పుడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ధన, ప్రాణ నష్టం జరగకుండా అగ్నిమాపక వాహనం వచ్చే సమయంలోగా ఏ విధంగా స్పందించాలో అగ్నిమాపక పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ట్రెండ్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

Under Or 21 rule 54 C.P.C నోటీసు
మహారాజశ్రీ బొబ్బిలి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషినల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాసు మెజిస్ట్రేట్ వారి దివ్యసముఖమునకు
E.P.50/2021 in O.S.129/2019

Between:
చనమల్ల కనకరాజు ....D.Hr
And:
రాజాన పూలమ్మ వగైరాలు ......J.Drs
To
J.Dr.No-3 : రాజాన మోహనరావు, వయస్సు 30సం॥, S/o లేటు వేణు, సేవానగర్ కోలనీ, కొమ్మాది జంక్షన్, విశాఖపట్నం.

పై నెంబరు అమలులో డిక్రీహోల్డరు తనబాకీ రాబట్టుకొనుటకు పై J.Drపై పిటిషనులో ఉన్న మీ తాలుక ఆస్తిని జప్తు జరిపించమని ఆస్తి జప్తు నోటీసు మీకు అమలు చేయుట కొరకు పై కోర్టువారు ఆర్డరు ప్రకారం సదరు అమలు పిటిషనులో మీరు హాజరు నిమిత్తము **తే 5-07-2023ది ఉదయం గం॥ 10-30ని॥ల**కు వాయిదా రోజున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

దాసరి అప్పలరాజు, B.Com, BL
అడ్వకేటు, అంట్యాకులవీధి,
వాయిదా : 5-7-2023 బొబ్బిలి, సెల్ : 9440306505